క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్‌కు సంతోష ఎంపిక



దోమ: సర్కారు బడిలో చదువుకుంటున్న ఓ చిన్నారి రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి, స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక అయింది. వివరాలు ఇలా ఉన్నాయి. దోమ మండలం దిర్సంపల్లి గ్రామానికి చెందిన కొత్త కాశప్ప, లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు. ఇందులో ఆఖరి అమ్మాయి సంతోష(7) దిర్సంపల్లి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. స్టేట్ లెవల్ సెలక్షన్‌లో నిర్వహించిన పోటీల్లో సంతోష సత్తా చాటి అదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక అయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. తొలిసారిగా గ్రామం నుంచి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లితండ్రులు, సర్పంచ్ శాంతారెడ్డి, స్కూల్ చైర్మన్ తిరుపతి, ఉపసర్పంచ్ శిరీష హర్షం వ్యక్తంచేస్తూ అభినందించారు.

కొనసాగుతున్న రైస్‌మిల్లు పనులు



నిర్మాణంలో ఉన్న రైస్‌మిల్లు

ధారూరు: ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైస్‌మిల్లు పనులు చకచకా జరుగుతున్నాయి. సర్వే నంబర్ 15లో కోట్‌పల్లి ప్రాజెక్టుకు వెళ్లే దారిలో నిర్మిస్తున్న మిల్లుకు రూ.1.64 కోట్లు మంజూరు అయ్యాయి. రెండు నెలల్లో పనులు పూర్తిచేసి, మిల్లును వినియోగంలోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

8న విగ్రహ ప్రతిష్ఠాపన

కొడంగల్: ఈ నెల 8న ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీ సమీపంలో శ్రీ సంతోషి మాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుదన్నారు.

ఎంపీకి ఆహ్వానం



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన నాయకులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన జూలకంటి పాండురంగారెడ్డి సోమవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 6న అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నందున కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ఎంపీని ఆహ్వానించారు. కాగా, మండలస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, నాయకులు వై ప్రకాష్ గుప్త, గోపాల్ రెడ్డి, సాత ప్రవీణ్‌కుమార్, బాలకృష్ణ, ప్రణీత్ కుమార్, రాంపాల్, సంజీవ్‌కుమార్, రాకుమార్, రఘునందన్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి: మోకిలలోని ఎస్సీ కాలనీలో ప్లాట్లు కబ్జా చేస్తున్న పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని మోకిల ఎస్సీకాలనీ వాసులు సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వే నంబర్ 31లో 5ఎకరాల, 6గంటల భూమి నగరానికి చెందిన సయ్యద్ మిర్జా ఆధీనంలో ప్రభుత్వ భూమి ఉండగా గ్రామపెద్దలు, తాము ఆయన్ను ఒప్పించి 35సంవత్సరాల క్రితం ఆ భూమిని తీసుకొని లేఅవుట్‌గా మార్చుకున్నామని తెలిపారు. ఒక్కో కుటుబానికి 110గజాల చొప్పున కేటాయించడం జరిగిందని చెప్పారు. కాగా.. లేఅవుట్‌లోని ప్లాట్లను ఎస్సీ కుటుంబాలకు కేటాయించగా కొన్ని ప్లాట్లు మిగిలాయి. గ్రామానికి చెందిన చిట్టంపల్లి సామయ్య పోలీసు శాఖలో ఉన్నతాధికారిగా ఉంటూ ఎస్సీ కాలనీలోని ప్లాట్లకు నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మోకిల పోలీసులు సైతం ఆయన చేసిందే న్యాయమని వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్, నాయకులు లింగం ముదిరాజ్, గోపాల్‌చారి ఉన్నారు.

నైపుణ్యంతో మంచి అవకాశాలు

మొయినాబాద్: ఏంబీఏ విద్యార్థులు నైపుణ్యం పెంచుకుంటే మంచి అవకాశాలు లభిస్తాయని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధి చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో 2021-23 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులు సోమవారం సిగ్నిచర్ డే వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు సమయం వృథా చేయకుండా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

లక్షలు వెచ్చించి.. వదిలేశారు

- నిరుపయోగంగా దుకాణ సముదాయం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- మడిగల కోసం వ్యాపారుల ఎదురుచూపు



నిరుపయోగంగా ఉన్న దుకాణ సముదాయం

పెద్దేముల్: జెడ్పీ నిధులతో నిర్మించిన మండల దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. నిరుపేదలకు ఉపాధి కల్పన, మండల పరిషత్ కార్యాలయానికి ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు ఏడాది క్రితం రూ.20 లక్షల జెడ్పీ నిధులతో ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఏడాది క్రితం ప్రారంభించారు. కానీ.. నేటికీ సంబంధిత అధికారులు లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. అట్టహాసంగా ప్రారంభించిన కాంప్లెక్స్ కోసం ఎంతో మంది యువకులు ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. అటు అద్దెకు ఇవ్వకుండా, ఇటు వేలం వేయకుండా అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.

ఆదాయానికి గండి

మండల పరిషత్ కార్యాలయానికి ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు జెడ్పీ నిధులతో మండల కేంద్రంలో ఐదు షటర్లతో దుకాణ సముదాయం నిర్మించారు. కానీ వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో అవి నిరుపయోగంగా పడున్నాయి. ఇదే విషయాన్ని పాలకులకు, సంబంధిత అధికారులకు విన్న వించినా ఫలితం లేదన్న ఆరోపణలు లేకపోలేదు. ఒక మడిగకు సుమారు రూ.2వేలు అద్దె వచ్చినా నెలకు రూ.10వేలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని, అధికారుల నిర్లక్ష్యం వలన వచ్చే రాబడికి గండి పడిందని స్థానికులు విమర్శించారు.

చొరవ చూపాలి

దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తెచ్చి, వ్యాపారం చేసుకునే వారికి అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం, యువతకు ఉపాధి దొరుకుతుందని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ లక్ష్మప్పను వివరణ కోరగా.. ఉన్నతాధికారులతో మాట్లాడి, త్వరలో ఉపయోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఖర్చుతో 'కూడు'కున్నది

- పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పరిగి: 'మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలంటే అధిక ఖర్చుతో కూడుకున్నది. అప్పులు తెచ్చి భోజనం పెడుతున్నాం. తొలుత పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలి' అని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో మండల విద్యాధికారి హరిశ్చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచుతున్నామని, బకాయిలు వెంటనే విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి రెండు నెలలు పూర్తవుతున్నా.. నేటికీ బిల్లులు రాలేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికై ఈ నెల 15న నగరంలో ధర్నా చేపట్టనున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు 149 దరఖాస్తులు

దౌల్తాబాద్: ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక క్యాంపులకు స్పందన లభించింది. ఈ నెల 2,3 తేదీల్లో చేపట్టిన కార్యక్రమంలో ఓటరు నమోదు, తొలగింపు, చేర్పులు, మార్పుల కోసం 164 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కొత్తగా ఓటరుగా పేర్ల నమోదుకు 149 కాగా.. ఓటు తొలగింపు, ఓటును మరో పోలింగ్ కేంద్రానికి మార్పునకు, పేర్లు సరిచేసుకోవడం వంటి వాటికి మరో 15 అర్జీలు వచ్చాయి. బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు రెండు రోజుల పాటు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించారు.

కేసులకు భయపడేది లేదు

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- కాంగ్రెస్ నాయకులు



తాండూరు కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నాయకులు

తాండూరు టౌన్: సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసులు పెట్టి, భయాందోళనలకు గురిచేస్తోందని, అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ అన్నారు. నిరుద్యోగ భృతి, రైతు సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గతంలో తాండూరులో జరిగిన ధర్నాలో పాల్గొన్న పలువురు కాంగ్రెస్ నాయకులపై పోలీసులు కేసులు పెట్టారు. ఇందులో భాగంగా సోమవారం నాయకులు రవికుమార్, సంతోష్ తదితరులు తాండూరు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ గౌడ్ మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణలో తొమ్మిదేళ్లుగా పరిపాలిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని, కేసులకు భయపడి వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- రాజీమార్గంతో డబ్బు, సమయం ఆదా
- ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు పీపుల్స్ కోర్టు
- హైకోర్టుల్లో అప్పీలు లేకుండానే పరిష్కారం



దోమ: న్యాయస్థానం పరిధిలోని చిన్నచిన్న తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, బీమా తదితర కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడనుందని పోలీసులు, న్యాయమూర్తులు సైతం స్పష్టం చేస్తున్నారు. ఇందులో కక్షిదారుల ఆమోదంతో రాజీ కుదిర్చి, ఇరువర్గాలకు న్యాయం జరిగేలా లోక్ అదాలత్ పరిష్కార మార్గం చూపుతుందని చెప్పారు. బాధితులు, కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, ఆర్థికంగా నష్టపోకుండా సత్వర న్యాయం కోసం సంస్థ ఎంతోగానో ఉపయోగపడనుందని చెప్పడం గమనార్హం.

అదాలత్ అంటే ఏమిటి?

చట్టంలో అందరికీ అవగాహన లేని అంశాలు ఎన్నో ఉంటాయి. అందులో ఒకటి లోక్ అదాలత్(పీపుల్స్ కోర్టు). కేసుల సంఖ్య పెరిగిపోతుండటంతో వాటికి సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌ను తీసుకువచ్చారు. దీని ద్వారా ఇరువర్గాలు తక్షణ పరిష్కారం పొందవచ్చు. లోక్ అదాలత్ అనేది లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్ 1987 ప్రకారం చట్టబద్ధమైన సంస్థ. ఇది దేశంలో ఉపయోగించే ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానంగా రూపొందించబడింది.

ఎలాంటి ఫీజు లేదు

పెండింగ్‌లో ఉన్న కేసులు లేదా న్యాయ స్థానంలో ప్రీ-లిటిగేషన్ దశలో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక లోక్ అదాలత్. ఈ చట్టం ప్రకారం లోక్ అదాలత్‌లు ఇచ్చే అవార్డు(నిర్ణయం) సివిల్ కోర్టు కేసుగా పరిగణించబడుతుంది. రాజీకి అవకాశం ఉన్న కేసులను మాత్రమే లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా పరిష్కరించుకోవచ్చు. ఆ సంస్థ ఇచ్చే తీర్పు అంతిమం. కేసులు పరిష్కారమైనప్పుడు అవార్డుకు వ్యతిరేకంగా ఏ న్యాయ స్థానం ముందు అప్పీలు చేయడానికి అవకాశం ఉండదు. లోక్ అదాలత్ తీర్పుతో ఇరుపక్షాల మధ్య మంచి సంబంధాలు ఏర్పడతాయి. ఇలా పరిష్కరించుకుని డబ్బును, సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. అదే కోర్టులో కేసు వేస్తే ఏళ్లు పడుతుంది. అప్పటి వరకు కోర్టు చుట్టూ తిరగాల్సిందే. లోక్ అదాలత్ కేసులకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదు.

ఖర్చు లేకుండా..



లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా ఇరువర్గాలు తక్షణ పరిష్కారం పొందవచ్చు. ఈ నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పరిగి పట్టణంలోని కోర్టులో లోక్ అదాలత్ జరుగుతుంది. ఇందులో మోటారు వెహికల్ యాక్టులు, ఆబ్కారీ కేసులు, బ్యాంకు రుణాలు, కుటుంబ తగాదాలు, చీటింగ్ కేసులు, యాక్సిడెంట్ తదితర కేసులకు పరిష్కార మార్గం దొరుకుతుంది. పలు కారణాలతో కేసుల్లో ఉన్న వ్యక్తులు కక్షిదారులతో రాజీ కుదుర్చుకునేందుకు సదవకాశం. సంప్రదించాల్సిన నంబర్లు: ఎస్‌ఐ, దోమ: 87126 70043, నరేశ్, పరిగి కోర్టు కానిస్టేబుల్: 81068 62426, కాశీం అలీ, వికారాబాద్ కోర్టు కానిస్టేబుల్: 87125 43260

– రవిగౌడ్, ఎస్‌ఐ, దోమ

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న పీఆర్టీయూ నేతలు

కుల్కచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి ఎనలేనిదని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల పరిధి పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలో అందరికీ మేలు జరిగేలా కృషి చేసిన ఏకైక సంఘం పీఆర్టీయూ అని చెప్పా రు. ఒక బదిలీలే కాదు.. ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, సంఘం నాయకులు శేఖర్, శ్రీను, వెంకటయ్య, మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అనంతగిరి: జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, ప్రజలు ఎవరు కూడా నీటి ప్రవాహాలను దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే తమ పరిధి పోలీస్ స్టేషన్‌కు కానీ, డయల్ 100కు కానీ ఫోన్ చేయాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బంట్వారం: ప్రస్తుత వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదని, తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని జీపీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉమాదేవి, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



బాలంపేటలో రోడ్డుపైనే సంత

సమస్యల సంత

- క్రయవిక్రయదారులకు చింత
- అనువైన స్థలం కేటాయించాలంటున్న ప్రజలు

దౌల్తాబాద్: వారాంతపు సంతకు అనువైన స్థలం లేకపోవడంతో క్రయవిక్రయదారులకు ఇబ్బందిగా మారింది. దౌల్తాబాద్, బాలంపేట, గోకఫసల్‌వాద్ గ్రామాల్లో రోడ్లు, ఇరుకైన ప్రాంతంలో అంగడి కొనసాగుతుండటంతో వ్యాపారులతో పాటు వినియోగదారులు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. సంతలో రైతులే స్వయంగా తాజా కూరగాయలు విక్రయిస్తుండటంతో వినియోగదారుడికి సరసమైన ధరలోనే కాకుండా.. నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తుండటంతో ఈ సంతలకు ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. దీంతో ప్రతి వారం ఇక్కడ రద్దీ అధికంగా ఉండటం వలన.. సమస్యగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సంతకు అనువైన స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తమ గురువులు వీరే..

- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంపిక



వెంకటమ్మ



థావుర్యనాయక్



గోపాల్



సురేష్

తాండూరు రూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోధనలో ఉత్తమ ప్రతిభ చూపిన వారు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు వివరాలు వెల్లడించారు. ఇందులో తాండూరు మండల పరిధి పాఠశాలల్లో పని చేస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో మల్లికార్జున్ (చెంగోల్), అంబమ్మ(అల్లాపూర్), జ్యోతి (మల్కాపూర్), మోయిజ్ మహమ్మద్ (కోట బాసుపల్లి), మనోహర్(రాంపూర్‌తండా), సీమ సుల్తాన (గడి, పాత తాండూరు) ఉన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

పెద్దేముల్ నుంచి ఏడుగురు

పెద్దేముల్: పెద్దేముల్ మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఏడు మంది ఎంపికయ్యారు. ఇందులో ప్రభాకర్‌రెడ్డి (ఇందూరు) ఉన్నత పాఠశాల, జైపాల్‌రెడ్డి, సరీత (మంబాపూర్), యశోద (పెద్దేముల్), సోమనాథం (జనగాం) ఎంపీయుపీఎస్, బంద్యప్ప (గోపాల్‌పూర్) ఎంపీయుపీఎస్), వెంకటలక్ష్మి (పెద్దేముల్, సీపీఎస్ పాఠశాల) ఉన్నారు.

నేడు సన్మానం

యాలాల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన వారికి మండల పరిషత్ తరపున మంగళవారం సన్మానం చేయనున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన సన్మాన జరగనుందని వెల్లడించారు.

కుల్కచర్ల నుంచి.. నలుగురు

కుల్కచర్ల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కుల్కచర్ల మండల పరిధి పాఠశాలల్లో పనిచేస్తున్న నలుగురు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇందులో వెంకటమ్మ (కామునిపల్లి) ప్రాథమిక పాఠశాల, థావుర్యనాయక్ (ఆముదాలగడ్డ), గోపాల్ నాయక్ (ఘణపూర్), సురేష్ (చౌడాపూర్ మండలం కొత్తపల్లి, జెడ్పీ పాఠశాల) ఉన్నారు. వీరి ఎంపిక పట్ల పీఆర్టీయూ సంఘం నేతలు హర్షం వ్యక్తంచేశారు.

మండల స్థాయి ఉపాధ్యాయులు వీరే..

శశిధర్‌రావు(పీఎస్ పగిడియాల), వీరమణి (పీఎస్ ఎన్కెపల్లి), రామకృష్ణ(పీఎస్ గిరిజాపూర్), సీహెచ్. రాజేష్(పీఎస్ రాస్నం), రమాకాంత్(పీఎస్ హాజీపూర్), మమత(పీఎస్ రాస్నం), సంతోష(పీఎస్ విశ్వనాథ్‌పూర్), జయశ్రీ(పీఎస్ పేర్కంపల్లి), మమత(పీఎస్ కమాల్‌పూర్), భార్గవి(పీఎస్ దేవనూరు), సద్గుణశీల(పీఎస్ పగిడిపల్లి), సుజాత(ఎల్‌పీహెచ్ యాలాల), మాధవి(సీఆర్‌టీ, కేజీబీవీ) ఉన్నారు.

జిల్లా స్థాయి టీచర్లు..

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి ముగ్గురికి అవకాశం దక్కింది. ఇందులో గోవర్ధన్‌రెడ్డి (పీఎస్ బాగాయిపల్లి), గీతారాణి(సీఆర్‌టీ కేజీబీవీ యాలాల), మధుసూదన్(పీఈటీ జుంటుపల్లి) ఉన్నారు. వీరు సన్మానం పొందనున్నారు. వీరి ఎంపిక పట్ల పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్‌లు హర్షం వ్యక్తంచేశారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

- శివాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



కొడంగల్ రూరల్: విశేష అలంకరణలో బసవేశ్వరుడు



ధారూరు: కపిలేశ్వరస్వామికి హారతి పడుతున్న భక్తులు

కొడంగల్ రూరల్: శ్రావణమాసం సోమవారం పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీ మహాదేవుని ఆలయం, శ్రీ జగద్గురు నిరంజన మఠం, బసవేశ్వర స్వామి, నగరేశ్వరస్వామి తదితర ఆలయాల్లో శివలింగానికి అభిషేకం చేశారు. శివలింగానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో నమక, చమక అధ్యాయాలను పఠిస్తూ రుద్రాభిషేకం నిర్వహించారు. మారేడు దళాలతో బిల్వాష్టకం, విశేష పూలతో శివ అష్టోత్తర శతనామావళి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మంగళహారతులు పడుతూ దర్శించుకున్నారు.

ధారూరులో..

ధారూరు: శ్రీ కపిలేశ్వరస్వామి (శివలింగం)కి శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రథమ పూజ్యులు గణనాథునికి తర్వాత పార్వతీమాత, కుమారస్వామి, వీరభద్రేశ్వరస్వామి, నాగదేవత, నందీశ్వరస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివలింగానికి జలం, పంచామృతాలతో అభిషేకం, పాలాభిషేకం అనంతరం అలంకరించి నైవేద్యం సమర్పించారు. హారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి చెన్నబసవయ్యస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

గాడిబాయి శివాలయంలో..

కొడంగల్: గాడిబాయి శివాలయంలో శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన అనంతరం స్వామివారికి రకరకాల పూలతో అలంకరణ చేశారు. హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు కిట్టు స్వామి పూజలు జరిపించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తాండూరు టౌన్: తాండూరు ది గ్రెయిన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణం స్వీకారం చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట్రాములు, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యాపారులకు, రైతులకు అసోసియేషన్ అండగా ఉండాలని చెప్పారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో రూ.30 కోట్లతో నూతన మార్కెట్ యార్డు నిర్మించనున్నట్లు తెలిపారు. గంజ్‌లో పనిచేసే కార్మికులకు గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నర్సింహులు, యాలాల ఎంపీపీ బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.